GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : మంగళవారం- డిసెంబర్ 05-2023 పేజీలు : 3



## తూప్రాన్‌లో కూలిన శిక్షణ విమానం..

- ఇద్దరు పైలెట్లు మృతి

**టీ మీడియా, డిసెంబర్ 4, తూప్రాన్:**

మెదక్ జిల్లా తూప్రాన్ సమీపంలో శిక్షణ విమానం కుప్పకూలింది. సోమవారం ఉదయం తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని రావెల్లి సమీపంలో ఒక శిక్షణ విమానం కూలిపోయింది. దీంతో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో పైలెట్, ట్రైనీ పైలెట్ సజీవ దహనమయ్యారు. విమాన ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. అది దుండిగల్ ఎయిర్‌పోర్టుకు సంబంధించిన శిక్షణ విమానంగా గుర్తించారు. మంటల్లో ఇద్దరు పైలెట్లు మృతిచెందారని, గుర్తించలేని విధంగా కాలిపోయారని తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

## తాడేపల్లిలో రేవంత్‌రెడ్డికి భారీ ప్లెక్సీ

- అంబటి ట్వీట్‌పై చర్చ

**టీ మీడియా, డిసెంబర్ 4,తాడేపల్లి:**

తెలంగాణ ఎన్నికల ఫలితాలు ఏపిలోనూ ఆసక్తి రేపాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి పోలింగ్.. రిజల్ట్స్ వరకు పెద్ద ఎత్తున చర్చ నడిచింది. పక్కనే ఉన్న రాష్ట్రం కావడంతో గెలుపోటములు ఏపిలో కూడా ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో పెద్ద ఎత్తున ఏపి ప్రజలు కూడా తెలంగాణ ఎన్నికల ఫలితాలపై ఆసక్తి చూపించారు. అదే విధంగా ఏ పార్టీ



మిగతా 2 లో

## తెలంగాణలో ఎన్నికల కోడ్ ఎత్తివేత:ఈసీ వెల్లడి

**టీ మీడియా, డిసెంబర్ 4,హైదరాబాద్:**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో గత అక్టోబర్ తొమ్మిదో తేదీన అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కేంద్ర ఎన్నికల సంఘం ఎత్తివేసింది. తెలంగాణతోపాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఎన్నికల కోడ్ ఎత్తివేస్తున్నట్లు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో తెలంగాణ,



మిగతా 2 లో

## అమరావతే ఏపీ రాజధాని

- పార్లమెంటు సాక్షిగా కేంద్రం స్పష్టత

**టీ మీడియా, డిసెంబర్ 4, న్యూఢిల్లీ :**

ఏపీ రాజధానిపై కీలక ప్రకటన చేసింది కేంద్రం. అమరావతే ఏపీ రాజధాని అని మరోసారి క్లారిటీ ఇచ్చింది. అమరావతి మాస్టర్ ప్లాన్ ను కేంద్రం ఆమోదించినట్లు పార్లమెంటు సాక్షిగా వెల్లడించింది. 28 రాష్ట్రాల రాజధానుల జాబితాను కేంద్రం విడుదల చేసింది. ఆ జాబితాలో ఏపీ రాజధానిగా అమరావతి పేరును ప్రస్తావించింది.రాజ్యసభలో ఎంపీ జావెద్ అలీ ఖాన్ అడిగిన ప్రశ్నలకు కేంద్రం స్పష్టత ఇచ్చింది. దేశంలోని చాలా (39శాతం) రాష్ట్రాల రాజధానులకు మాస్టర్



మిగతా 2 లో





## ఏమి జరుగుతుందో వేచి చూద్దాం..

- ఎమ్మెల్యేలతో కేసీఆర్..

**టీ మీడియా, డిసెంబర్ 4, ఎర్రవెల్లి:**

ప్రజల తీర్పును గౌరవిద్దాం.. రాజ్యాంగ బద్దంగా జనవరి 16 వరకు మన ప్రభుత్వం కొనసాగే అవకాశం ఉండే.. కానీ, ప్రజల తీర్పుతో హుందాగా తప్పుకున్నాం.. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కే చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వానికి సహకరిద్దాం.. ఏమి జరుగుతుందో వేచి చూద్దాం.. అంటూ కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సూచించారు. త్వరలో తెలంగాణ భవన్లో పార్టీ సమావేశం నిర్వహిస్తామని.. అప్పుడు శాసనసభాపక్ష నేతను ఎన్నుకుందామంటూ పేర్కొన్నారు. సిద్ధిపేట జిల్లాలోని జగదేవ్ పూర్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు సోమవారం వెళ్లి సీఎం కేసీఆర్ ను కలిశారు. తెలంగాణ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి కేసీఆర్.. ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఎన్నికైన ఎమ్మెల్యేలకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ఫలితాలపై సమీక్ష జరిపిన కేసీఆర్.. గెలుపొందిన ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా మాట్లాడారు.

# తెలంగాణకు రెడ్ అలెర్ట్..


## భారీ నుంచి అతి భారీ వర్షాలు

**టీ మీడియా, డిసెంబర్ 4, హైదరాబాద్:**

మిచౌంగ్ తుఫాను కారణంగా డిసెంబర్ 5న తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రాష్ట్రానికి రెడ్ అలర్ట్ ప్రకటించింది. మంగళవారం రాష్ట్రంలో 204.4 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని IMD అంచనా వేసింది. రెడ్ అలర్ట్ జారీ చేయడంతో, ప్రజలు అప్రమత్తంగా, సురక్షితంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం, మైచాంగ్ తుఫాను తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశాలోని పలు ప్రాంతాల్లో విపరీతమైన ప్రభావం చూపుతుంది.

### చెన్నైలో వర్ష బీభత్సం

మిచౌంగ్ తుపాను తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. తెల్లవారుజాము నుంచి చెన్నైలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నగరంలోని 14 రైల్వే సబ్‌వేల్లోకి నీరు చేరడంతో వాటిని మూసివేశారు. తాంబ్రం ప్రాంతంలో 15 మందిని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. చెన్నైలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.వానలు, వరదల కారణంగా చెన్నై విమానాశ్రయంలోకి కూడా నీరు చేరింది. కోయంబత్తూరు-చెన్నై మధ్యలో రెండు విమాన సర్వీసులను



రద్దు చేసినట్లు ఇండిగో ప్రకటించింది. చాలా విమానాలను చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయానికి మళ్లించారు. ఇప్పటి వరకు దాదాపు 11 విమానాలను దారి మళ్లించారు. భారీ వర్షాల కారణంగా చెన్నైలోని పాఠశాలలు మూసివేశారు. నగరంలోని కోర్టులకు సెలవు ఇచ్చినట్లు మద్రాస్ హైకోర్టు ప్రకటించింది. వీలైనంత వరకు ప్రజలు ఇళ్లలోనే ఉండాలని అధికారులు కోరారు.

### ఏపీ సర్కార్ అలెర్ట్

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం చెన్నైతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో మరో 24 గంటలపాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. మరోవైపు మిచౌంగ్ తుఫాను నెల్లూరు %--% మచిలీపట్నం మధ్య తీరం దాటవచ్చన్న సమాచారంతో సీఎం జగన్ కలెక్టర్లతో సమీక్ష జరిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు సీనియర్ అధికారుల నియమించారు. ప్రాణనష్టం జరగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు సీఎం జగన్.

ఇటు తుపాను ప్రభావంతో అవనిగడ్డ నియోజకవర్గం వ్యాప్తంగా ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం కురుస్తోంది. తుఫాన్ప్రభావంతో హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో ఎగిసిపడుతున్న అలలు ఎగసిపడుతున్నాయి. సుమారు మీటర్ల ఎత్తున అలలు ఎగిసి పడుతున్నాయి. మిచౌంగ్ తుఫాను పరిస్థితులను పర్యవేక్షించేందుకు అధికారులు నాగాయలంక, కోడూరు మండలాలకు చేరుకున్నారు. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వేటకు వెళ్ళిన మత్స్యకారులను వెనక్కి పిలిపిస్తున్నారు. తుఫాను దృష్ట్యా పాఠశాలలకు, కాలేజీలకు సెలవులు ప్రకటించారు. తుఫాన్ నేపథ్యంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అల్లూరి సీతారామరాజు, విశాఖ, మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు.

## అసెంబ్లీని రద్దు చేస్తూ గవర్నర్ నిర్ణయం

**టీ మీడియా, డిసెంబర్ 4,హైదరాబాద్:**

తెలంగాణ ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ముగియడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు తెలంగాణ మూడో శాసనసభ ఏర్పాటు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ గెజిట్‌ను చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ (సీఈవో) వికాస్ రాజ్, ఈసీ ముఖ్య కార్యదర్శి గవర్నర్ తమిళిసైకు అందజేశారు. అంతేకాకుండా ఎన్నికలపై నివేదికను సమర్పించారు. గెలుపొందిన ఎమ్మెల్యేల జాబితాను సీఈవో వికాస్ రాజ్ గవర్నర్‌కు అందించారు.

ప్రస్తుత శాసనసభను రద్దు చేస్తూ గవర్నర్ తమిళిసై సర్క్యులర్ జారీ చేశారు. ప్రస్తుత శాసనసభను రద్దు చేస్తూ అసెంబ్లీ సెక్రటరీ నరసింహాచారి కాసేపటి క్రితమే ప్రతులను గవర్నర్‌కు అందజేశారు. అటు కొత్త మంత్రుల కోసం అధికారులు వాహనాలను సిద్ధం చేశారు. ఈ మేరకు దిల్‌కుష అతిథి గృహానికి వాహనాలను తీసుకొచ్చారు. కొత్త ప్రభుత్వానికి తగిన విధంగా సచివాలయంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు జీఏడీ ఛాంబర్లను సిద్ధం చేస్తోంది. అధికారులు పాత బోర్డులను తొలగించారు. ప్రభుత్వ సలహాదారుల కార్యాలయాలను సిబ్బంది ఖాళీ చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో మీడియాకు ప్రత్యేక గది కేటాయించారు.



## బీఆర్ఎస్‌లోనే ఉంటాము

- ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి ,తెల్లం వెంకట్రావు

**టీ మీడియా, డిసెంబర్ 4,హైదరాబాద్:**

ఎమ్మెల్యేగా గెలవాలనే ఆకాంక్ష నెరవేరింది. కానీ తాను పోటీ చేసిన పార్టీ ఓడిపోయింది. ఎన్నికల్లో ఇటువంటి పరిస్థితి చాలామంది ప్రజాప్రతినిధులకు ఎదురవుతుంటుంది. తెలంగాణలో తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి అలాగే ఉంది. బీఆర్ఎస్ గెలుపుపై ఫుల్ కాన్ఫిడెన్స్ తో ఉన్న ఆ పార్టీ అభ్యర్థులు తాము గెలిచినందుకు సంతోషించాలో, తమ పార్టీ ఓడిపోయినందుకు బాధపడాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.సరిగ్గా అటువంటి పరిస్థితుల్లో కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఉన్నారు. దీంతో ఆయన పార్టీ మారిపోతున్నారని.. పార్టీ ఫిరాంపునకు పాల్పడుతున్నారనే ప్రచారం జోరందుకుంది. కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళుతున్నారని, దాని కోసం రేవంత్ రెడ్డిని కలిసారనే ఊహాగానాలు వచ్చాయి. దీంతో కౌశిక్ రెడ్డి మీడియా ముందుకు వచ్చి క్లారిటీ ఇచ్చారు. తాను పార్టీ మారటలేదని.. పాత ఫోటో పెట్టి తాను రేవంత్ రెడ్డిని కలిసినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది ఎంత మాత్రం నిజం కాదని స్పష్టం చేశారు. తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ లోనే ఉంటానని.. కేసీఆర్, ఆయన కుటుంబంతో ఉంటానని వెల్లడిచారు. ఫేక్ వీడియోలు, ఫోటోలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. తనను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన హుజురాబాద్ ప్రజల నమ్మకాన్ని ఖచ్చితంగా నిలబెట్టుకుంటానని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా, కౌశిక్ రెడ్డి హుజురాబాద్ లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పై బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీచేసి గెలుపొందిన విషయం తెలిసిందే.సరిగ్గా ఇటువంటి ఆరోపణలే వచ్చాయి భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుపై. దీంతో తెల్లం క్లారిటీ ఇచ్చారు. తాను కాంగ్రెస్ లోకి వెళున్నానని అసత్య ప్రచారం చేస్తున్నారని.. తాను పార్టీ మారేది లేదని వెల్లడించారు. కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తానని తెలిపారు. కాగా..ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ మళ్లీ ఒకే ఒక స్థానం భద్రాచలం అభ్యర్థి తెల్లం వెంకట్రావు కావటం గమనించాల్సిన విషయం.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 52 మంది కొత్తగా గెలిచారు. రాష్ట్రంలోని 119 మంది అమ్మెల్యేల్లో కొత్తగా 52 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి అడుగుపెట్టనున్నారు. వీరిలో కాంగ్రెస్ నుంచి 34 మంది కొత్తగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. బీఆర్ఎస్ నుంచి 9 మంది ఉండగా వీరిలో హుజురాబాద్ నుంచి పోటీ చేసి గెలిచిన పాడి కౌశిక్ రెడ్డి ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు.








## సిఎల్పీ నేత ఎంపికలో ట్విస్ట్

- ప్రమాణ స్వీకార కార్యక్రమం వాయిదా
- అధిష్టానం పిలుపుతో డికె ఢిల్లీకి పయనం
- సీఎంగా రేంవత్ రెడ్డి..ఇంకా ఓకే చెప్పని కాంగ్రెస్ హైకమాండ్
- డిప్యూటీ సీఎంలు భట్టి విక్రమార్క, సీతక్క?

**టీ మీడియా, డిసెంబర్ 4, హైదరాబాద్:**

రాజభవన్ లో జరగాల్సిన కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం అనూహ్యంగా వాయిదా పడింది.. సిఎల్సీ అధినేతను ఢిల్లీ పెద్దలు ఖరారు చేయకపోవడంతో ప్రమాణ స్వీకారం నిలిచిపోయింది.. సిఎల్సీ నేత ఎంపిక నిర్ణయాన్ని ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గేకు అప్పగిస్తూ సిఎల్సీ చేసిన ఏక వాక్య తీర్మానాన్ని ఉదయం ఢిల్లీకి పంపారు..నేడు అక్కడి ఉంచి గ్రీన్ సిగ్నల్ వస్తుందని భావించిన కాంగ్రెస్ నేతలు రాజ్ భవన్ లో ప్రమాణ స్వీకారానికి ఏర్పాటు చేయించారు.. అయితే డికె,శివకుమార్ తో సహా తెలంగాణ పరిశీలకులుగా ఉన్న వారందర్ని తక్షణం ఢిల్లీకి రావాలని పిలుపు రావడతో నేటి కార్యక్రమం వాయిదా పడింది..అధిష్టానం పిలుపుతో డికె, ఇతర నేతలు ఢిల్లీకి పయనమయ్యారు..ఇది ఇలా ఉంటే తెలంగాణ సీఎంగా బాధ్యతలను స్వీకరించే అవకాశాన్ని రేవంత్‌రెడ్డికే కాంగ్రెస్ పార్టీ అప్పగించినట్టు తెలుస్తోంది. రేవంత్ రెడ్డితో పాటు భట్టి విక్రమార్క, సీతక్క డిప్యూటీ సీఎంలుగా ప్రమాణ స్వీకారం చేస్తారని సమాచారం అందుతోంది. అనూహ్యంగా మరో డిప్యూటీ సీఎం పదవికి సీతక్క పేరు వెలువడటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో సంతోషం నెలకొంది. ఒక దళిత, మరో గిరిజన నేతకు డిప్యూటీ సీఎం హెూదా లభించటంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నిజానికి సీతక్కకు గిరిజనశాఖ, లేక హెూం మంత్రి పదవి లభిస్తుందని చాలామంది భావించారు. అకస్మాత్తుగా డిప్యూటీ సీఎం పదవికి యోగ్యురాలిగా ఎంపిక చేయటంతో కాంగ్రెస్‌లోని గిరిజన వర్గాలు సంబురపడుతున్నాయి.సీఎం పదవి ఎవరిని వరిస్తుందనే విషయంలో అందరికీ క్లారిటీ ఉన్నా సోమవారం ఉదయం నుంచి నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాగా, కాంగ్రెస్ అధిష్ఠానం టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వైపే మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. పార్టీ రథసారథిగా.. ఎన్నికల్లో రేవంత్ చూపించిన పోరాట పటిమకు హైకమాండ్ ఫిదా అయిందని, లోక్ సభ ఎన్నికల్లోనూ ఆయన సామర్థ్యాన్ని వినియోగించుకోవాలనే లక్ష్యంతో పార్టీ ఈ నిర్ణయం తీసుకుందని కీలక నేతలు చెబుతున్నారు. కర్నాటక సీఎం డీకే శివకుమార్ పంపించిన సీల్డ్ కవర్‌ను పరిశీలించిన జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తన ఆమోదాన్ని తెలుపుతూ సమాచారం ఇచ్చినట్టు కాంగ్రెస్ కీలక నేతలు మీడియాకు సమాచారం ఇచ్చారు.కాంగ్రెస్ శ్రేణుల్లో సంబురాలు.ఖర్గే పంపిన కబురుతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. హైదరాబాద్ సిటీలో సంబరాలు చేసుకున్నారు. ఇక.. తెలంగాణ తదుపరి సీఎం ప్రమాణ స్వీకారం రాజ్ భవన్‌లోని దర్బార్ హాల్‌లో సీఎంతో పాటు ఇద్దరు డిప్యూటీ సీఎంలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు జీఏడీ (జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) నుంచి గవర్నర్ కార్యాలయానికి సమాచారం అందింది. కాగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న దర్బార్ హాల్‌లో 300 మంది కూర్చునే వెసులుబాటు కల్పించారు. మిగిలిన ఆహ్వానితులకు ఎక్కడ ఏర్పాట్లు చేయాలనే అంశంపై జీఏడీ అధికారుల కసరత్తు చేస్తున్నారు.

### అందరి ఆమోద యోగ్యంతోనే..

సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డిని ఎన్నుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని ఆమోదించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు లేఖను పంపించారు. ముఖ్యమంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డిని కొనసాగించాలనే తీర్మానాన్ని భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు సహా పది మంది ఎమ్మెల్యేలు ప్రవేశపెట్టారు. ఈ భేటీలో సీఎల్పీ నేతగా రేవంత్ రెడ్డిని ఎన్నుకున్నట్టు ఏకవాక్య తీర్మానం చేసి, అధిష్టానానికి సీల్డ్ కవర్‌లో కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పంపించారు. అయతే సాయంకాలానికి పరిస్థితులు వేగంగా మారిపోయాయి.. తెలంగాణ పరిశీలకులు ఢిల్లీకి రావాలని పిలుపు రావడంతో సిఎల్పీ నేత ఎంపికపై కాంగ్రెస్ నేతలలో కొత్త టెన్షన్ ప్రారంభమైంది

## తాడేపల్లిలో రేవంత్‌రెడ్డికి భారీ ఫ్లెక్సీ

(మొదటిపేజీ తరువాయి)

గెలుస్తుందన్న అంశంపై పెద్ద ఎత్తున బెట్టింగ్స్ నడిచాయి. ఈ క్రమంలోనే రేవంత్ కు తాడేపల్లిలోని జాతీయ రహదారిపై భారీ ఫ్లెక్స్ ఏర్పాటు చేశారు ఆయన అభిమానులు. గుంటూరు, విజయవాడ మధ్యన ఉన్న తాడేపల్లిలోనే సిఎం జగన్ నివాసం కూడా ఉండటం గమనించాల్సిన అంశం. సీఎం జగన్ నివాసానికి కూత వేటు దూరంలో రేవంత్ కు భారీ ఫ్లెక్స్ ఏర్పాటు చేయడం ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. రాహుల్ చౌదరి పేరుతో ఏర్పాటైన ఫ్లెక్స్ లో రేవంత్‌రెడ్డి సిఎంగా ప్రమాణం చేస్తున్నట్లు పేర్కొనడం విశేషం. ఈ అంశం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు తెలంగాణలో రేవంత్ రెడ్డి విజయంపై ఏపీ మంత్రి అంబటి చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. టీడీపీ-జనసేన పార్టీలపై తరచు విరుచుకుపడే అంబటి తాజాగా జనసేన జెండా ఎన్టీఆర్ భవన్‌కి%ొా% తెలుగుదేశం జెండా గాంధీ భవన్‌కి అంటూ ఎక్స్ ప్లాట్ ఫాంలో కామెంట్ చేశారు.

## తెలంగాణలో ఎన్నికల కోడ్ ఎత్తివేత:ఈసీ వెల్లడి

(మొదటిపేజీ తరువాయి)

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ తొలగినట్లయింది.తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో గత అక్టోబర్ తొమ్మిదో తేదీన అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కేంద్ర ఎన్నికల సంఘం ఎత్తివేసింది. తెలంగాణతోపాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఎన్నికల కోడ్ ఎత్తివేస్తున్నట్లు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ తొలగినట్లయింది.తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ ముగిసింది.

## అమరావతే ఏపీ రాజధాని

(మొదటిపేజీ తరువాయి)

ప్లాన్ లేదనేది నిజమా? కాదా? అని ఎంపీ జావెద్ ప్రశ్నించారు. ఎంపీ ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి కౌశల్ కిశోర్ వివరణ ఇచ్చారు. రాష్ట్రాల రాజధానులకు మాస్టర్ ప్లాన్ లేదన్న మాట అవాస్తవం అన్నారు.ఏపీ రాజధాని అమరావతితో సహా 26 రాష్ట్రాల రాజధానులకు మాస్టర్ ప్లాన్ ఉందని వెల్లడించారు. త్రిపుర రాజధాని అగర్తల, నాగాలాండ్ రాజధాని కోహిమాల మాస్టర్ ప్లాన్లు మినహా అన్ని రాష్ట్రాల రాజధానుల మాస్టర్ ప్లాన్లను కేంద్రం ఆమోదించినట్లు వివరించారాయన.గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిగా నిర్ణయించారు. ల్యాండ్ పూలింగ్ (రైతుల దగ్గరి నుంచి భూములు సేకరించి) చేసి రాష్ట్ర రాజధానిగా అమరావతిని ఎంపిక చేయడం జరిగింది. ప్రధాని మోదీ శంకుస్థాపన కూడా చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాజధాని మారుస్తున్నాం అంటూ బిల్లులు కూడా తీసుకొచ్చింది. ఒకటి కాదు మూడు రాజధానులు అని ప్రకటన చేసింది. రాజధాని మారుస్తూ బిల్లు తీసుకొచ్చిన జగన్ ప్రభుత్వం ఆ తర్వాత ఉపసంహరించుకుంది.ఏపీ రాజధాని ఏది? అనే అంశంపై గతంలో అనేకసార్లు కేంద్రం క్లారిటీ ఇచ్చింది. ఇవాళ పార్లమెంటు వేదికగా మరోసారి ఏపీ రాజధాని అమరావతే అన్న విషయాన్ని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కౌశల్ కిశోర్ స్పష్టం చేశారు. దేశంలో చాలా రాష్ట్రాల రాజధానులకు మాస్టర్ ప్లాన్ లేదన్నది అవాస్తవం అని, మాస్టర్ ప్లాన్లతోనే రాజధానులు ఏర్పడుతున్నాయి, ఒక ప్రణాళిక బద్ధంగానే రాష్ట్రాల రాజధానులు ఏర్పాటవుతున్నాయని, వాటికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం కూడా తెలిపిందన్నారు. ఏపీ రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ కు సైతం కేంద్రం ఆమోదం తెలిపినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ తెలిపింది.

## వరుస భూకంపాలతో వణికిపోతున్న ఫిలిప్పీన్స్

**టీ మీడియా, డిసెంబర్ 4, మనీలా:**



దక్షిణ ఫిలిప్పీన్స్‌లో మిండానావో ద్వీపం వరుస భూకంపాలతో వణికిపోతున్నది. గత శనివారం 7.6 తీవ్రతతో బలమైన భూకంపం వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు మిండానావో ద్వీపంలోని హినాటువాన్ మున్సిపాలిటీలో మరోసారి భూమి కంపించింది. దీని తీవ్రత 6.9గా నమోదయిందని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూ అంతర్భాగంలో 30 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయని తెలిపింది. హినాటువాన్‌కు 72 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నదని చెప్పింది. కాగా, భూకంపం వల్ల జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదని అధికారులు వెల్లడించారు. కాగా, ఆదివారం సాయంత్రం కూడా 6.6 తీవ్రతతో భూమి కంపించింది. ఇక శనివారం ఇదే ప్రాంతంలో 7.6 తీవ్రతతో భూకంపం వచ్చింది. దీంతో పలు ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. శనివారం నాటి భూకంపం వల్ల ఇద్దరు మరణించారు. పలువురిని పునరావాస కేంద్రాలకు తరలించామని అధికారులు వెల్లడించారు.

## ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో చెలరేగిన మంటలు..

- **వ్యక్తి సజీవదహనం**

**టీ మీడియా, డిసెంబర్ 4, నల్లగొండ:**




నల్లగొండలో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఓ ప్రయాణికులు సజీవదహనమయ్యాడు. సోమవారం తెల్లవారుజామున మర్రిగూడ బైపాస్ వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి హైవేపై శ్రీ కృష్ణ ట్రావెల్స్‌కు చెందిన బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా అవి బస్సుమొత్తానికి వ్యాపించడంతో పూర్తిగా దగ్ధమయింది. మంటలు రావడంతో అప్రమత్తమైన ప్రయాణికులు కిందికి దిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అయితే నిద్రమత్తులో ఉన్న ఓ వ్యక్తి బస్సు దిగకపోవడంతో అతగు సజీవదహనమైనట్లు గుర్తించారు. ప్రమాద సమయంలో బస్సులో 39 మంది ప్రయాణికులు ఉన్నారని తెలిపారు. హైదరాబాద్ నుంచి చీరాల వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామన్నారు.

## తుఫాన్ సహాయక కార్యక్రమాల్లో పాల్గొనండి

- **కార్యకర్తలకు చంద్రబాబు పిలుపు**

**టీ మీడియా, డిసెంబర్ 4, అమరావతి :**



తుఫాన్ సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ%ొా% రాష్ట్రంపై మిచౌంగ్ తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుందనే సమాచారం ఆందోళన కలిగిస్తోందని, ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. తుఫాను కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో పక్కా ప్రణాళిక ద్వారా అన్నదాతలకు నష్టం జరగకుండా చూడాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని కోరారు. గతంలో అకాల వర్షాల కారణంగా ధాన్యం రైతులు తీవ్రంగా నష్టపోయినా%ొా% ప్రభుత్వం తగు రీతిలో స్పందించ లేదన్నారు. ధాన్యం కొనుగోలులో రకరకాల ఆంక్షలతో ఇప్పటికే రైతులు ఇబ్బంది పడుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని, ధాన్యం కొనుగోలులో ఆంక్షలు తొలగించాలన్నారు. తుఫాను బాధిత ప్రజల కోసం షెల్టర్లు, అవసరమైన ఆహారం అందించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని చంద్రబాబు కోరారు. తమ పార్టీ కార్యకర్తలు, నేతలు తుఫాను బాధితులకు అండగా నిలవాలని చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చారు. పలు జిల్లాలపై తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. బాధిత వర్గాలకు అండగా ఉండాలని, చేతనైన సాయం చేయాలని చంద్రబాబు నాయుడు పార్టీ నేతలు, కార్యకర్తలను కోరారు.

## సనాతన ధర్మంపై వ్యాఖ్యలను వక్రీకరించారు

- **తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్**

**టీ మీడియా, డిసెంబర్ 4, చెన్నై :**



సనాతన ధర్మంపై తన వ్యాఖ్యలను బీజేపీ వక్రీకరించిందని డీఎంకే నేత, తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. కరూర్ జిల్లాలో జరిగిన యువ కార్యకర్తల భేటీలో ఉదయనిధి మాట్లాడుతూ.. గతంలో సనాతన ధర్మంపై తాను చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ గతంలో తాను సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలను తప్పుగా చిత్రీకరించారని ఆరోపించారు. తాను ఊచకోతకు పిలుపు ఇచ్చానని, తాను అనని మాటలను ప్రధాని తనకు ఆపాదించారని స్టాలిన్ ఆరోపించారు. తాను ఓ సదస్సుకు హాజరై కొద్ది నిమిషాలు మాట్లాడానని, ఎవరిపట్ల వివక్ష చూపకుండా అందరినీ సమానంగా చూడాలని తాను కోరానని గుర్తుచేశారు. అయితే తాను చేసిన వ్యాఖ్యలను కాషాయ నేతలు వక్రీకరించి యావత్ దేశం తన గురించి మాట్లాడుకునేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ స్వామీజీ తన తలపై రూ. 5-10 కోట్లు వెలకట్టారని అన్నారు. ప్రస్తుతం ఈ కేసు న్యాయస్థానం పరిధిలో ఉందని, న్యాయస్థానాల పట్ల తనకు విశ్వాసం ఉందని చెప్పారు. తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని కోరారని, కానీ తాను క్షమాపణ చెప్పేదిలేదని స్పష్టం చేశానన్నారు. తాను స్టాలిన్ కొడుకునని, కలైంజ్ఞర్ మనవడినని, తాను వారి భావజాలాన్ని మాత్రమే సమర్థిస్తున్నానని చెప్పాను.

# ఒకే గ్రామం, ఒకే కుటుంబం..

- **ఇద్దరు ఎమ్మెల్యేలుగా బ్రదర్స్**

**టీ మీడియా, డిసెంబర్ 4, నల్లగొండ:**





ఆ కుటుంబం, ఆ గ్రామం.. రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఆ గ్రామం ఇద్దరినీ ఎమ్మెల్యేలుగా చట్టసభలకు పంపింది. ఒకే గ్రామమే కాదు, ఒకే కుటుంబం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఆ నేతలు నిత్యం సెన్సేషనల్ కామెంట్స్‌తో రాజకీయాలను ప్రభావితం చేస్తూ.. రాష్ట్ర, జాతీయ స్థాయి రాజకీయ నేతలుగా ముద్ర వేసుకున్నారు. ఘనత వహించిన ఆ గ్రామం, ఆ కుటుంబం ఈ ఎన్నికల్లోనూ గెలిచి మరోసారి తన వారసత్వాన్ని చాటుకుంది. ఆ గ్రామం, ఆ కుటుంబం ఎక్కడ ఉంది.. ఆ నేతలు ఎవరో తెలుసు కోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే..నల్లగొండ జిల్లా నార్కెట్ పల్లి మండలం బ్రాహ్మణ వెల్లంలకు ఓ ప్రత్యేకత ఉంది. కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెనర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆయన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ గ్రామానికి చెందిన వారే. ఈ ఇద్దరూ తోబుట్టువులు. ఈ సోదరలిద్దరూ 2009 నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌గా బ్రాండ్ ఇమేజ్ పొందిన వీరికి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబమేమి కాదుయువనేతగా ప్రజాదరణ పొందిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి 1999లో తొలిసారిగా శాసనసభ్యుడిగా అడుగుపెట్టారు అప్పటి నుంచి వరుసగా నాలుగుసార్లు నల్గొండ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక అవుతూ వస్తున్నారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి చేతిలో అనుహ్యంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీగా మరోసారి సత్తా చాటారు. అయితే ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ స్థానం నుంచి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.ఇక కోమటిరెడ్డి బ్రదర్స్‌లో ఒకరైన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి భువనగిరి ఎంపీగా గెలిచారు. 2014 పార్లమెంటు ఎన్నికల్లో ఓటమిపాలైన రాజగోపాల్ రెడ్డి తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి మునుగోడు నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2022లో కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తర్వాత జరిగిన మునుగోడు ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరఫున పోటీ చేశారు. సమీప బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చేతిలో రాజగోపాల్ రెడ్డి ఓటమి పాలయ్యారు. 15 నెలల పాటు బీజేపీలో కొనసాగిన రాజగోపాల్ రెడ్డి తిరిగి సొంత గూటికి చేరి, కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున మునుగోడు నుంచి ఎమ్మెల్యేగా రెండోసారి ఎన్నికయ్యారు.ఇదే గ్రామానికి చెందిన కోమటిరెడ్డి బ్రదర్స్ అనుచరుడు చిరుమర్తి లింగయ్య 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నకిరేకల్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో ఓటమిపాలైన చిరుమర్తి లింగయ్య 2018 లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత బీఆర్ఎస్ కండువా కప్పుకుని ఈ ఎన్నికల్లో చిరుమర్తి లింగయ్య బీఆర్ఎస్ తరఫున తన అదృష్టాన్ని పరీక్షించుకున్నప్పటికీ ఓటమిపాలయ్యారుదివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులతో ఈ ముగ్గురు నేతలను బ్రాహ్మణ వెల్లంల చట్టసభలకుపంపింది. జిల్లా రాజకీయాలను ప్రభావితం చేస్తూ రాష్ట్ర జాతీయస్థాయి నేతలుగా కోమటిరెడ్డి బ్రదర్స్ ముద్ర వేసుకున్నారు. ఈ ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ నుంచి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు నుంచి విజయం సాధించారు. ఇద్దరు రాజకీయ నేతలను అందించిన కోమటిరెడ్డి కుటుంబం, బ్రాహ్మణ వెల్లంల గ్రామం రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం దక్కించుకుంది. దీంతో ఎన్నికల్లో ఒకే గ్రామం ఒకే కుటుంబం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు.

## ఇది కాంగ్రెస్ ఓటమి, ప్రజలది కాదు

- **మమతా బెనర్జీ**

**టీ మీడియా, డిసెంబర్ 4, న్యూఢిల్లీ :**



" ఇది కాంగ్రెస్ ఓటమి, ప్రజలది కాదు" అని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష కూటమి ఇండియాలోని మిగిలిన పార్టీలతో సీట్లపంపకం లేకపోవడం వలనే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించిందని, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలోనూ కాంగ్రెస్ గెలవాల్సింది కానీ .. కొన్ని ఓట్లను ఇండియా కూటమిలోని పార్టీలు చేజిక్కించుకోవడంతో ఓటమిపాలైందని ఇదే వాస్తవమని అన్నారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని పార్టీలతో కలిసి పోటీ చేసేందుకు కాంగ్రెస్ ముందుకు రాలేదని, దీంతో ఓట్ల విభజన జరిగిందని అన్నారు. భావజాలంతో పాటు గెలిచేందుకు సరైన వ్యూహం, ప్రణాళిక కూడా ఉండాలని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమిలోని పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఒప్పందం జరిగితే కేంద్రంలో బిజెపిని గద్దెదించవచ్చని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలలోపు ఇండియా కూటమి కలిసి పనిచేసి, తప్పులు సరిదిద్దుకుంటుందని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో అరుదైన పునుగు పిల్లి మృతి

**టీ మీడియా, డిసెంబర్ 4, మహానంది:**

అంతరించిపోతున్న ఎంతో అరుదైన జాతికి చెందిన పునుగు పిల్లి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. నంద్యాల గిద్దలూరు జాతీయ రహదారి నల్లమల అడవి ప్రాంతం పచ్చర్ల సమీపంలో ఓ పునుగు పిల్లి రోడ్డుపై మృతిచెంది ఉండడాన్ని అటవి శాఖ సిబ్బంది గుర్తించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆ పునుగుపిల్లి మృతి చెందింది. ఈ విషయం తెలిసిన చలమ ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ ఈశ్వరయ్య, డిఆర్ఓ రాజు, గార్డు రామారావు ఘటనా స్థలానికి చేరుకొని, జరిగిన ప్రమాదాన్ని పరిశీలించి, పునుగు పిల్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా చలమ ఫారెస్ట్ రేంజ్ ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రతినిత్యం ఈ రహదారి యందు వన్యప్రాణులు తిరిగే ప్రాంతం కావడంతో, వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలంటూ తెలిపారు.కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ.

## మహానందిలో భక్తులకు అన్నదానం

- **అన్నదాన వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ఈవో, ఎస్ఐ**

**టీ మీడియా, డిసెంబర్ 4, మహానంది:**



మహానంది పుణ్య క్షేత్రంలో కార్తీక మూడవ సోమవారం సందర్భంగా భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమం తిమ్మాపురం గ్రామానికి చెందిన వైయస్సార్ సిపి నాయకులు ఒంటెద్దు వీరారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొని, స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదాన వితరణ చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు.

## కొత్త సీఎం కోసం కాన్వాయ్ రెడీ..

**టీ మీడియా, డిసెంబర్ 4, హైదరాబాద్:**



కొత్త సీఎం కోసం కొత్త కాన్వాయ్‌ని సాధారణ పరిపాలన విభాగం రెడీ చేసింది. ప్రాథమికంగా వైట్ కలర్ కాన్వాయ్ సిద్ధం చేశారు అధికారులు. దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌కి 6 ఇన్నోవా కార్లు చేరుకున్నాయి. రెండు కొత్త కార్లు కాగా 4 ఇప్పటికే నెంబర్ ప్లేట్ అలాట్ అయిన కార్లు ఉన్నాయి. ప్రమాణస్వీకారం తర్వాత కొత్త కాన్వాయ్‌లో సీఎం ఇంటికి వెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే బాధ్యతలు చేపట్టిన కొత్త సీఎం.. తన అభీష్టం మేరకు కాన్వాయ్‌ను మార్చుకునే అవకాశం ఉంది,మరోవైపు తెలంగాణలో రెండో శాసనసభను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రద్దు చేశారు. మంత్రివర్గ సిఫార్సు మేరకు రెండో శాసనసభను రద్దు చేశారు గవర్నర్. కొత్త ప్రభుత్వానికి సంబంధించి సాంకేతికపరమైన ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి.

## ఆప్ ఎంపి రాఘవ్ చద్దా సస్పెన్షన్‌ను ఎత్తివేసిన రాజ్యసభ

**టీ మీడియా, డిసెంబర్ 4, న్యూఢిల్లీ :**





ఆప్ ఎంపి రాఘవ్ చద్దాపై సస్పెన్షన్‌ను రాజ్యసభ సోమవారం ఎత్తివేసింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు సోమవారం నుండి ప్రారంభమైన సంగతి తెలిసిందే. సమావేశాల మొదటి రోజున బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు చేసిన తీర్మానాన్ని అనుసరించి సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. "ప్రత్యేక హక్కుల ఉల్లంఘన" ఆరోపణలపై రాజ్యసభ రాఘవ్ చద్దాపై ఈ ఏడాది ఆగస్టు 11 నుండి 115 రోజులపాటు సస్పెండ్ విధించింది. ఢిల్లీ సర్వీసెస్ ఆర్డినెన్స్ అధ్యయన కమిటీ సభ్యులుగా వారి అనుమతి లేకుండానే అధికార బిజెపికి చెందిన ఇద్దరు సహా నలుగురు రాజ్యసభ ఎంపిలను ప్రతిపాదించేందుకు చద్దా ఫోర్జరీ సంతకాలు చేసినట్లు బిజెపి ఆరోపించింది. ఈ ఆరోపణలను చద్దా తిప్పికొట్టారు. బిజెపి తనను లక్ష్యంగా చేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసత్యాన్ని వెయ్యిసార్లు చెప్పే అది వాస్తవం అవుతుంది అనేది బిజెపి సూత్రం. ఈ సూత్రంతోనే తనపై దుష్ప్రచారాన్ని ప్రారంభించారని, తాను ఎవరి సంతకాన్ని ఫోర్జరీ చేశానో సాక్ష్యాలు చూపాలని బిజెపికి సవాలు విసిరారు. సెలెక్ట్ కమిటీకి పేర్లను ప్రతిపాదించడానికి ఎంపి సంతకం లేదా వ్రాతపూర్వక సమ్మతి అవసరం లేదని రాజ్యసభ నిబంధనల పుస్తకంలో అంశాన్ని ప్రస్తావించారు. తన సస్పెన్షన్‌ను సవాలు చేస్తూ చద్దా సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న 'హాయ్ నాన్న' టీమ్

**టీ మీడియా, డిసెంబర్ 4, తిరుమల :**



టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'హాయ్ నాన్న'. నాని 30 గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు శౌర్యువ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా డిసెంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. అయితే విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం తిరుపతి వెళ్లిన 'హాయ్ నాన్న టీమ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు నానికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గర్భాలయంలో స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## ట్రాన్స్ కో, జెన్ కో సీఎండీ ప్రభాకర్ రావు రాజీనామా

**టీ మీడియా, డిసెంబర్ 4, హైదరాబాద్:**



ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ పదవికి దేవులపల్లి ప్రభాకర్ రావు తన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలో 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ అందించడంలో ప్రధాన పాత్ర పోషించిన ప్రభాకర్ రావు. తొమ్మిదిన్నరేండ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. 22 ఏండ్ల వయస్సులోనే విద్యుత్ శాఖలో చేరిన ఆయన 2014, జూన్ 5న జెన్‌కో సీఎండీగా బాధ్యతలు చేపట్టారు. అదే ఏడాది అక్టోబర్ 25న ట్రాన్స్‌కో ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. తొలుత ఆయన్ను రెండేండ్ల పదవీ కాలానికి సీఎండీగా ప్రభుత్వం నియమించినప్పటికీ.. తర్వాత పదవీ కాలాన్ని పొడిగిస్తూ వస్తున్నది. తాజాగా ఆయన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో 54 ఏండ్లపాటు సంస్థకు సేవలు అందించారు. తన పదవీ కాలంలో విద్యుత్ శాఖకే ఆయన వెలుగులు పంచి వన్నె తెచ్చారు. తెలంగాణ రాష్ట్రం వస్తే చీకట్లు కమ్ముకుంటాయని జరిగిన ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి 2014లో సీఎం కేసీఆర్ 24 గంటల నిరంతరం కరెంటు ఇచ్చే పనికి శ్రీకారం చుట్టారు. చీకట్లను చీల్చుకుంటూ విద్యుత్ వెలుగులను పంచడానికి ముందుకు సాగిన కేసీఆర్‌కు ఆయన ఒక కార్యకర్తగా కృషిచేశారు.

## ఇండోనేషియాలో పేలిన అగ్నిపర్వంతం

- **11 మంది హైకర్లు మృతి**

**టీ మీడియా, డిసెంబర్ 4, జకార్తా :**



పశ్చిమ ఇండోనేషియాలోని అగ్నిపర్వత్వం పేలడంతో 11 మంది హైకర్లు మరణించారు. మరో ముగ్గురిని సహాయక బృందాలు రక్షించినట్లు అధికారులు సోమవారం తెలిపారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. సుమత్రా ద్వీపంలో 2,891 మీటర్లు (9,484 అడుగుల) ఎత్తులో ఉన్న మౌంట్ మరాపీ ఆదివారం విస్ఫోటనం చెందింది. అగ్ని పర్వతం నుండి ఎత్తులో మూడు వేల మీటర్ల ఎత్తులో బూడిద చిమ్మిన దృశ్యాలు మీడియాలో వైరలయ్యాయి. సమీప గ్రామాలపై బురద ప్రవహించినట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం ఈ పర్వతంపై మొత్తం 75 మంది ట్రెక్కింగ్ వెళ్లినట్లు పదాంగ్ సెర్చ్ అండ్ రెస్క్యూ ఏజెన్సీ అధ్యక్షుడు అబ్దుల్ మాలిక్ వెల్లడించారు. వీరిలో 11 మంది పర్యాటకులు మరణించినట్లు నిర్ధారించారు. 12 మంది గల్లంతు కాగా, మరో 49 మంది పర్వతం నుండి కిందకి దిగారని, వారిని ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అగ్నిపర్వతం వద్ద కాలిన గాయాలతో ముగ్గురు కనిపించారని, వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని మాలిక్ వివరించారు. ఇప్పటికీ విస్ఫోటనం కొనసాగుతోందని, దీంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అన్నారు. అగ్నిపర్వతం నుండి విరజిమ్ముతున్న పొగ, బూడిద సమీప ప్రాంతాలను కమ్మేశాయని చెప్పారు. విస్ఫోటనం తర్వాత బూడిద వర్షం కురిసిందని మౌంట్ మారాపి మానిటరింగ్ స్టేషన్‌లోని అధికారి అహ్మద్ రిఫాండి తెలిపారు. 10,000 కన్నా ఎక్కువ జనాభా ఉన్న పశ్చిమ సుమత్రాలోని మూడవ అతిపెద్ద నగరమైన బుకిట్టింగీని కూడా బూడిద కమ్మేసిందని అన్నారు. గ్రామస్తులకు మాస్కులు అందించామని, ఇళ్లలోనే ఉండాల్సిందిగా ఆదేశించినట్లు స్థానిక విపత్తు ఏజన్సీ అధికారి అడే సెటియావాన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఏకపక్ష' ఫలితాలు ఆందోళకరం

- **బిఎస్‌పి అధ్యక్షురాలు మాయావతి**

**టీ మీడియా, డిసెంబర్ 4, లక్నో:**



నాలుగు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధ్యక్షురాలు మాయావతి స్పందించారు. ఈ ఏకపక్ష ఫలితాలు ప్రజలను ఆశ్చర్యానికి గురిచేయడంతో పాటు ఆందోళనకు గురిచేశాయని అన్నారు. ఈ ఫలితాలపై చర్చించి.. 2024 లోక్‌సభ ఎన్నికలపై వ్యూహాన్ని చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 10న లక్నోలో సమావేశం జరుగుతుందని అన్నారు. "రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ ఎన్నికల ప్రచార సమయంలో పరిస్థితి చూస్తే హోరాహోరీ పోరు ఉంటుందనే భావన ఉంది. కానీ ఎన్నికల ఫలితాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఏకపక్షంగా వచ్చిన ఫలితాలు చూసి ప్రజలందరికీ అనుమానం ఆశ్యర్యం, ఆందోళన, భయం కలగడం సహజమే. ఎన్నికల వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకొంటే.. ఇలాంటి విచిత్రమైన ఫలితాలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు ఆమోదించడం కష్టమే" అని 'ఎక్స్' లో ట్వీట్ చేశారు. ప్రజలనాడిని గ్రహించడంలో ఘోరంగా విఫలం కావడం అనేది ఇప్పుడు చర్చనీయాంశమని అన్నారు. ఫలితాల పట్ల నిరుత్సాహ పడవద్దని ఆమె పార్టీ సభ్యులకు సూచించారు. బిఎస్‌పి కార్యకర్తలంతా పూర్తి శక్తుయుక్తులతో పోరాడారని, ఫలితాలు చూసి నిరాశ చెందవద్దని, అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడిన సంగతి తెలిసిందే. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో బిజెపి విజయం సాధించగా.. తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు సాధించింది.

## మహానంది క్షేత్రంలో భక్తుల సందడి

**టీ మీడియా, డిసెంబర్ 4, మహానంది:**



మహానంది పుణ్యక్షేత్రంలో కార్తీక మాసం పురస్కరించుకొని మూడవ సోమవారం తెల్లవారుజామున నుండి భక్తులతో సందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన భక్తులే కాక, కర్ణాటక మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో మహానందికి తరలివచ్చారు. కోనేరులలో పుణ్య స్నానాలు ఆచరించి, కార్తీకదీపాలు వెలిగించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఎంతో పవిత్రమైన కార్తీక సోమవారం కావడంతో క్షేత్రానికి వచ్చిన భక్తులు అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు.ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన హింస..

- తెగల మధ్య ఘర్షణలో 13 మంది మృతి




**టీ మీడియా, డిసెంబర్ 4, న్యూఢిల్లీ:**
మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. టెంగ్‌నౌపాల్ జిల్లా సైబాల్ సమీపంలోని లీతూ గ్రామంలో రెండు తెగలకు చెందిన జనం మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరినొకరు కర్రలు, రాళ్లతో కొట్టుకున్నారు. తుపాకులతో కాల్చుకున్నారు. ఈ ఘర్షణల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘర్షణలు జరుగుతున్నట్లు సమాచారం అందగానే తాము ఘటనా ప్రాంతానికి వెళ్లామని, అప్పటికే అక్కడ 13 మృతదేహాలు పడి ఉన్నాయని భద్రతాధికారులు తెలిపారు. అయితే, ఈ ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారు లీతూ గ్రామానికి చెందిన వారు కాదని అధికారులు ప్రాథమిక విచారణలో తేలింది. వేరే ప్రాంతం నుంచి వచ్చిన ఈ గ్రూప్.. గ్రామంలోని మరో తెగకు చెందిన గ్రూప్‌తో ఘర్షణకు దిగిందని భద్రతాధికారులు చెప్తున్నారు. స్థానికులు కాకపోవడంతో మరణించిన 13 మంది ఎవరనేది ఇంకా గుర్తించలేదు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఈ ఏడాది మే 3న మణిపూర్‌లోని మైతీ, కూకీ తెగల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణలు కొన్ని నెలలపాటు కొనసాగాయి. ఈ హింసాత్మక ఘటనల్లో మొత్తం 182 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 50 వేల మంది నివాసాలను కోల్పోయారు. ఈ ఘర్షణల కట్టడి కోసం ఆ రాష్ట్రంలో భారీగా బలగాలను మోహరించారు. ఇంటర్నెట్ సేవలపై కూడా నిషేధం విధించారు. ఇటీవలే పరిస్థితి అదుపులోకి రావడంతో ఆదివారమే ఇంటర్నెట్ సేవలను తిరిగి పునరుద్ధరించారు. ఇంతలోనే మళ్లి తెగల నడుమ ఘర్షణలు చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది.

# దక్షిణ గాజాలోకి ప్రవేశించిన ఇజ్రాయిల్ సైన్యం



**టీ మీడియా, డిసెంబర్ 4, గాజా :**
ఇజ్రాయిల్ సైన్యం దక్షిణ గాజాలోకి ప్రవేశించినట్లు ప్రత్యక్ష సాక్షులు సోమవారం పేర్కొన్నారు. గాజాకు దక్షిణాన నిరాశ్రయులైన పాలస్తీనియన్లు ఉంటున్న ఖాన్ యునిస్ నగరానికి సమీపంలో డజన్ల కొద్దీ ఇజ్రాయిల్ యుద్ధ ట్యాంకులు, బుల్డోజర్లు, కారియర్లు, సాయుధ సిబ్బంది ప్రవేశించినట్లు ప్రత్యక్షసాక్షులు మీడియాకు తెలిపారు. గాజాలోని అల్-ఖరారా గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఇజ్రాయిల్ యుద్ధ వాహనాలు నిలిచాయని అమిన్ అబు (59) మీడియాకు వివరించారు. గాజాస్ట్రిప్ ఉత్తర-దక్షిణ ప్రధాన రహదారి సలాహ్ -అల్ దిన్ రోడ్‌లో ఇజ్రాయిల్ ట్యాంకులు నడుస్తున్నాయని మరో వ్యక్తి తెలిపారు. ఇజ్రాయిల్ ఉత్తర గాజాలోకి సైన్యాన్ని మరియు యుద్ధట్యాంకులను పంపిన కొన్ని వారాల తర్వాత .. పాలస్తీనియన్లను గాజా దక్షిణాన ప్రత్యేకంగా ఖాన్ యునిస్ ప్రాంతాలకు పారిపోవాలని హెచ్చరిస్తూ ఇజ్రాయిల్ సైన్యం కరపత్రాలను జారవిడిచిన సంగతి తెలిసిందే. హమాస్‌ను అణచివేసేంతవరకు తన గ్రౌండ్ ఆపరేషన్‌ను విస్తరిస్తామని ఇజ్రాయిల్ డిఫెన్స్ పోర్సెస్ ప్రతినిధి డేనియల్ హగారి ఆదివారం ప్రకటించారు. హమాస్ బలంగా ఉన్నచోట ఐడిఎఫ్ పనిచేస్తుందని అన్నారు. ఖతార్, ఈజిప్ట్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయిల్-హమాస్ మధ్య కుదిరిన ఒప్పందం ముగిసిన వెంటనే గత శుక్రవారం ఇజ్రాయిల్ తిరిగి యుద్ధాన్ని ప్రారంభించింది. అప్పటి నుండి దక్షిణ గాజాపై వైమానిక దాడులు తీవ్రమయ్యాయని ఐరాస చిన్నారుల ఏజన్సీ (యునిసెఫ్ ) ప్రతినిధి జేమ్స్ ఎల్లర్ తెలిపారు. హామీ ఇచ్చినప్పటికీ.. ఉత్తరాదిపై క్రూరమైన దాడులు జరిగినట్లుగానే దక్షిణాదిపై విరుచుకుపడతారని ఆయన గతంలో ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఏదేమైనప్పటికీ.. ఇది చిన్నారులు, మహిళలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ అభినందన సభ

**టీ మీడియా, డిసెంబర్ 4, రామకృష్ణాపూర్ :**
చెన్నూరు నియోజకవర్గం క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో 15 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సందర్భంగా క్యాతనపల్లి మున్సిపాలిటీలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి ,పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, సిపిఐ పార్టీ పట్టణ అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్,అబ్దుల్ అజీజ్ జిల్లా పట్టణ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ కార్యచరణ, క్యాతనపల్లి మున్సిపాలిటీ లోని అభివృద్ధి పనుల గురించి చర్చించడం జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం జరిగింది. కావున వివేక్ వెంకటస్వామి కి ఓటేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అహర్నిశలు శ్రమించి పార్టీ గెలుపుకు కృషిచేసిన కాంగ్రెస్, సిపిఐ కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు, అహంకారంతో దొరతనం ప్రదర్శించడం వల్ల ఇసుక మాఫియ, గుండాయిజం చేయించడం వల్లనే బాల్క సుమన్ ను ప్రజలు గద్దెదించారని, వెనక వచ్చినా కానీ వివేక్ వెంకట స్వామిని అత్యధిక మెజార్టీతో ప్రజలు గెలిపించినారు అందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చేల చూస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపతి రాజయ్య, ఆకుల మహంకాళి శ్రీనివాస్, యాకూబ్ ఆలీ, సత్యపాల్, ఎర్రవెల్లి రాజేష్, కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళా నాయకురాలు కల్పన, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# కీం కర్తవ్యం

- ఎమ్మెల్యేలు, నేతలతో కేటీఆర్ సమీక్ష
- ముగ్గురు ఎమ్మెల్యేలు డుమ్మా!




**టీ మీడియా, డిసెంబర్ 4,హైదరాబాద్:**
ఎన్నికల ఫలితాల అనంతరం ఎన్నికైన పార్టీ ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీ సీనియర్ నాయకులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు కేంద్ర పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారితో కేటీఆర్ ఈ సందర్భంగా వారితో కేటీఆర్ మాట్లాడారు. 10 సంవత్సరాల కాలంలో భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో అనేక అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టామని, అందుకే ప్రజలు ఇంకో పార్టీకి అవకాశం ఇచ్చినా, మన పార్టీకి గౌరవప్రదమైన స్థానాలను కట్టబెట్టారన్నారు. ప్రజలు మనకు అందించిన ప్రతిపక్ష పార్టీ బాధ్యతను విజయవంతంగా నిర్వహిద్దామన్నారు. ఎన్నికల తర్వాత ప్రజల నుంచి మన పార్టీ నాయకత్వం పైన ఒక సానుకూలను స్పందన వస్తున్నదని, మన పార్టీ అధికారం కోల్పోతుందని అనుకోలేదని, సమాజంలోని అన్ని వర్గాల నుంచి వందలాది మెసేజ్లు వస్తున్న విషయాన్ని కేటీఆర్ తో పాటు, పార్టీ నాయకులు చర్చించారు. త్వరలోనే పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు పోదాం అన్నారు. ప్రభుత్వంలో అధికారంలో ఉన్నప్పుడు సచివాలయం మరియు ప్రగతి భవన్ కేంద్రంగా విధులు నిర్వహించిన మనమంతా, ఇకపైన పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ కేంద్రంగా ప్రజలకు అందుబాటులో ఉందామన్నారు.

ఈ సందర్భంగా పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలకు కేటీఆర్ అభినందనలు తెలిపారు ఈ భేటీకి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గైర్హాజరయ్యారు. ముఖ్యమైన మీటింగ్కు హైదరాబాద్లో ఉన్న ఎమ్మెల్యేలే రాకపోవడంతో వీరు పార్టీ మారే అవకాశం ఉందని జోరుగా ప్రచారం సాగుతోంది..అనంతరం ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు అందరూ కేసీఆర్ ఫామ్ హౌస్‌కు బయలుదేరి వెళ్లారు..

# లోపాలు సరిదిద్దుకుంటాం..

- లోక్‌సభ ఎన్నికలే టార్గెట్‌గా పనిచేస్తాం
- కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు..



**టీ మీడియా, డిసెంబర్ 4, హైదరాబాద్:**
లోక్‌సభ ఎన్నికలే టార్గెట్‌గా పనిచేస్తామని తెలంగాణ బీజేపీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో తాము ఆశించిన సీట్లు రాకపోయినప్పటికీ.. ఓటు శాతం పెరిగిందన్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రజాతీర్పును గౌరవిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తామని కిషన్ రెడ్డి స్పష్టంచేశారు. ఇప్పటిదాకా బీజేపీని తిట్టిన వాళ్లని తెలంగాణ ప్రజలు ఫామ్ హౌస్‌కి పంపించారని ఎద్దేవా చేశారు. దీన్ని బట్టి చూస్తే ప్రజలు మోదీని కోరుకుంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. నాంపల్లి బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. బీజేపీ 8 స్థానాల్లో విజయం సాధించిందని తెలిపారు. తెలంగాణలో 7 నుంచి 14 శాతానికి ఓటు బ్యాంకు పెరిగిందని.. గత ఎన్నికలతో పోల్చుకుంటే 100 శాతం ఓటింగ్ శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఎంతో కష్టపడ్డాం.. అయినా అనుకున్న స్థాయిలో ఫలితాలు రాలేదన్నారు. జాతీయ స్థాయి నుంచి.. మండల, బూత్ స్థాయి వరకు సమీక్ష జరిపి పార్లమెంట్ ఎన్నికలకు తమ తప్పులను సరిదిద్దుకుంటామని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు డబ్బులను పంచి గెలవాలని చూశాయన్నారు. కాంగ్రెస్ కు.. తెలంగాణలో ఉన్న పరిస్థితి ఛత్తీస్గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లో లేదన్నారు. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారాన్ని బీజేపీ తీసుకుందని.. మధ్యప్రదేశ్ లో గతంలో కాంటే ఎక్కువ మెజారిటీ ఇచ్చారన్నారు. కామారెడ్డిలో ఒక ముఖ్యమంత్రి, ఇంకొకరు కాబోయే ముఖ్యమంత్రి అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డిని ఓడించి రికార్డు సృష్టించామని పేర్కొన్నారు. కాటిపల్లి వెంకట రమణా రెడ్డిని అభినందిస్తున్నామన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో భారీ విజయం సాధిస్తామని తెలిపారు.
వచ్చిన 14 శాతం నుంచి ఇంకా పెంచుకుంటూ వెళ్లాలని.. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ శ్రేణులకు పిలునిచ్చారు. ప్రచారానికి వెళ్లిన సమయంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ ఓటర్లు కూడా.. తాము అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తామో తెలియదు.. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం బీజేపీకి వేస్తామని చెప్పారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తగ్గేదే లేదు.. 5 ఏండ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికలపైనా ఇప్పటి నుంచే దృష్టి పెడతామన్నారు. తాము గెలిచింది 8 స్థానాలే కావచ్చు.. కానీ తమకు 80 మంది బలాన్ని ఇచ్చారన్నారు. భవిష్యత్ లో మరింత కసితో పనిచేస్తామని.. క్రియాశీల ప్రతిపక్ష పార్టీగా తమ పాత్ర పోషిస్తాం.. ప్రజల పక్షాన నిలబడుతామని చెప్పారు. తమపై బురద జల్లి చివరకు కేసీఆరే.. ఫామ్ హౌజ్ కు వెళ్ళారన్నారు. తమ పోరాటం కాంగ్రెస్ కు లాభం చేకూర్చింది.. అయినా పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.తమ ఓటమిపై అన్ని స్థాయిల్లో సమీక్ష నిర్వహించుకుని ముందుకు వెళతామన్నారు. ఇవ్వాళ ఢిల్లీకి వెళ్తున్నానని.. పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవ్వడంపై, ఈ ఎన్నికల్లో జరిగిన పోలింగ్ సరళిపై వివరిస్తానన్నారు. తమ పార్టీ వాళ్లే.. తనను ఓడించారని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కిషన్ రెడ్డి.. ఆ వ్యాఖ్యలు తన దృష్టికి రాలేదన్నారు. కర్ణాటక ఎన్నికలు, తమపై బురద జల్లడం, ఇతర కారణాల వల్ల ఓడిపోయామని.. ఇతర కారణాలపై కూడా విశ్లేషణ చేసుకుంటామని తెలిపారు.

# విమాన సర్వీసులపై తుపాన్ ప్రభావం..

- విశాఖ నుంచి ఐదు సర్వీసులు రద్దు



**టీ మీడియా, డిసెంబర్ 4, అమరావతి :**
బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాన్ ప్రభావం ఏపీ విమాన సర్వీసులపై పడింది. తుపాన్ ప్రభావం అంతకంతకూ బలపడుతూ ఏపీ తీర ప్రాంతంవైపు దూసుకొస్తున్న నేపథ్యంలో విశాఖ నుంచి చెన్నై.. గన్నవరం విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ఐదు విమాన సర్వీసులను ఇండిగో సంస్థ రద్దు చేసింది. సోమవారం విశాఖ నుంచి చెన్నై వెళ్లాల్సిన ఇండిగో విమానం (6ఈ-845) వాతావరణం సరిగా లేనందున రద్దయ్యింది. అలాగే విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన ఇండిగో విమానం (6ఈ-574) సర్వీసును రద్దు చేశారు. ఇక విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన ఇండిగో విమానం (6ఈ-881) రద్దయ్యింది. అలాగే విశాఖ నుంచి విజయవాడ వెళ్లాల్సిన ఇండిగో విమానం (6ఈ-7063) రద్దు చేసినట్లు ఇండిగో ఎయిర్ న్స్ ప్రకటించింది. విశాఖ నుంచి చెన్నై వెళ్లాల్సిన ఇండిగో విమానం (6ఈ-6089) కూడా రద్దు చేసినట్లు ఇండిగో తెలిపింది. ఇదిలా ఉంటే తిరుపతి, విజయవాడ నుంచి ఇతర ప్రాంతాల సర్వీసులు కొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇంకొన్ని విమానాలను దారి మళ్లిస్తున్న పరిస్థితి నెలకొంది. రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉదయం రావలసిన స్పైస్ జెట్, ఇండిగో, ఎయిర్ ఇండియా, విమానాలను వర్షం కారణంగా దారి మళ్లించారు. దీంతో ప్రయాణీకులు కొంత ఇబ్బందిని ఎదుర్కొన్నారు. విమాన సర్వీసులు రద్దుకావడంతో కొందరు ప్రయాణీకులు ప్రత్యామ్నాయ మార్గాల్లో తమ గమ్య స్థానాలకు చేరుకుందుకు ప్రయత్నం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావం తగ్గిన తరువాత విమాన సర్వీసులు రీ షెడ్యూలు చేస్తామని ఇండిగో సంస్థ ప్రకటించింది.

# గుండెపోటుతో జడ్పీ ఛైర్మన్ కన్నుమూత



**టీ మీడియా, డిసెంబర్ 4,జనగామ:**
ఇటీవల కాలంలో హార్ట్ ఎటాక్ కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. యువకుల నుంచి పెద్దవారి వరకు చాలామంది మరణిస్తున్నారు. తాజాగా.. జనగామ జడ్పీ ఛైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి గుండెపోటుతో కన్నుమూశారు. హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. పాగాల సంపత్‌రెడ్డి ప్రస్తుతం జనగామ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా ఉన్నారు. పాగాల సంపత్ రెడ్డి సోమవారం సాయంత్రం వేళ గుండెపోటు రావడంతో అకస్మాత్తుగా కింద పడిపోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆయన్ను హనుమకొండలోని రోహిణి ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ మరణించారు. సంపత్ రెడ్డి జనగామ నుంచి బరిలో నిలిచిన పల్లా రాజేశ్వర్?రెడ్డి గెలుపు కోసం ఎన్నికల ప్రచారంలో అహర్నిశలు కృషి చేశారు. సంపత్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందడం పట్ల పార్టీ కార్యకర్తలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# కొనసాగుతున్న రాజీనామాల పర్వం



**టీ మీడియా, డిసెంబర్ 4హైదరాబాద్:**
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే రాజీనామాల పర్వం ప్రారంభమైంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాడిన తర్వాత వచ్చిన ఎన్నికల్లో రెండు సార్లు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. కానీ, ఈసారి మాత్రం కాంగ్రెస్ పార్టీ గెలవడంతో.. ఇన్నాళ్లు కేసీఆర్ సర్కార్ లో నామినేటెడ్ పదవుల్లో ఉన్న పలువురు తమ పదవులకు రాజీనామా చేస్తున్నారు. ఇన్ని రోజులు ట్రాన్స్ కో, జెన్ కో సీఎండీగా ఉన్న దేవులపల్లి ప్రభాకర్ రావు తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పంపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు ప్రభాకర్‌రావు తెలిపారు.
ఇక మరోవైపు, సాంస్కృతిక సలహాదారుడిగా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ రమణాచారి కూడా తన పదవికి రిజైన్ చేశారు. తమ రాజీనామా లేఖలను సీఎస్ శాంతికుమారికి పంపించారు. అలాగే, కాగా, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ ప్రభాకర్ రావు సైతం రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపించారు. రాజీనామా లేఖలు పంపి వారు వీరే.. కార్పొరేషన్ల చైర్మన్లు డా .దూది మెట్ల బాలరాజ్ యాదవ్, రవీందర్ సింగ్, డా. వాసుదేవ రెడ్డి, మన్నె క్రిశాంక్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, జూలూరు గౌరీశంకర్, పల్లె రవికుమార్ గౌడ్, పాటి మీద జగన్ మోహన్ రావు, అనిల్ కూర్మాచలం, గజ్జెల నగేష్, మేడె రాజీవ్ సాగర్, డా.ఆంజనేయులు గౌడ్, సతీష్ రెడ్డి, రామచంద్ర నాయక్, గూడూరి ప్రవీణ్, వాల్యా నాయక్ తో పాటు మరికొందరు ఉన్నారు.

# ఇండియా టూర్‌కు దక్షిణాఫ్రికా జట్ల ఎంపిక




**టీ మీడియా, డిసెంబర్ 4, న్యూఢిల్లీ :**
ఈ నెల 10 నుంచి భారత క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికాలో పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా టీమిండియా 3 టీ20లు, 3 వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. డిసెంబరు 26 నుంచి తొలి టెస్టు, వచ్చే ఏడాది జనవరి 3 నుంచి రెండో టెస్టు జరగనున్నాయి. ఈ రెండు టెస్టుల సిరీస్ కోసం ఇటీవలే భారత జట్టును ప్రకటించగా%ా% తాజాగా దక్షిణాఫ్రికా కూడా జట్టును ప్రకటించింది. ఈ సిరీస్ లో సఫారీ జట్టుకు టెంబా బవుమా కెప్టెన్ గా వ్యవహరిస్తాడు. యువ బ్యాట్స్ మన్ ట్రిస్టాన్ స్టబ్స్ తొలిసారి టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు. బ్యాట్స్ మన్ డేవిడ్ బెడింగ్ హామ్, ఫాస్ట్ బౌలర్ నాంద్రే బర్గర్ కూడా ఈ సిరీస్ ద్వారా టెస్టు క్రికెట్ గడప తొక్కుతున్నారు. సౌతాఫ్రికా టీ20 జట్టు: ఎయిడెన్ మార్క్‌రమ్ (కెప్టెన్), ఒట్నీల్ బార్ట్‌మన్, మాథ్యూ బ్రీట్జ్, నంద్రె బర్గర్, గెరాల్డ్ కోయెట్జ్ (తొలి, రెండో టీ20కి మాత్రమే), డొనొవన్ ఫెరీరా, రీజా హెండ్రిక్స్, మార్కో జాన్సెన్ (తొలి, రెండో టీ20కి మాత్రమే), హెన్రిచ్ క్లాసెన్, కేశవ్ మహారాజ్, డేవిడ్ మిల్లర్, లుంగి ఎంగిడి (తొలి, రెండో టీ20కి మాత్రమే), అండిల్ పెహ్లుక్వాయో, తబ్రైజ్ షంసీ, ట్రిస్టన్ స్టబ్స్, లిజాడ్ విలియమ్స్

**వన్డే జట్టు:** ఎయిడెన్ మార్క్‌రమ్ (కెప్టెన్), ఒట్నీల్ బార్ట్‌మన్, నంద్రె బర్గర్, టోని డి జోర్జి, రీజా హెండ్రిక్స్, హెన్రిచ్ క్లాసెన్, కేశవ్ మహారాజ్, మిహలి ఎంపగ్వానా, డేవిడ్ మిల్లర్, వియాన్ మల్డర్, ఆండిల్ పెహ్లుక్వాయో, తబ్రైజ్ షంసీ, రస్సీ వాన్‌డెర్ డసెన్, కైల్ వెర్రెయెన్, లిజాడ్ విలియమ్స్

**టెస్టు జట్టు:** టెంబా బవుమా (కెప్టెన్), డేవిడ్ బెడింగ్హమ్, నంద్రె బర్గర్, గెరాల్డ్ కొయెట్జ్, టోని డి జోర్జి, డీన్ ఎల్గర్, మార్కో జాన్సెన్, కేశవ్ మహారాజ్, ఎయిడెన్ మార్క్‌రమ్, వియాన్ మల్డర్, లుంగి ఎంగిడి, కీగన్ పీటర్సన్, కగిసొ రబాడా, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెర్రెయెన్

# శీతాకాలం ఆలస్యమైనా.. రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది

- ప్రధాని మోదీ



**టీ మీడియా, డిసెంబర్ 4, న్యూఢిల్లీ:**
నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడారు. శీతాకాలం ఆసల్యమైనా.. దేశంలో మాత్రం రాజకీయ వాతావరణం వేడెక్కుతున్నట్లు ఆయన అన్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఉత్సాహాన్ని నింపుతున్నాయన్నారు. మహిళలు, యువత, రైతులు, పేదల పక్షాన ఉన్న వారికి అనూహ్యమైన మద్దతు లభిస్తోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలన్న తపన ఉంటే, అప్పుడు ప్రజా వ్యతిరేకత ఉండదని మోదీ అన్నారు. దేశంలో ఇప్పుడు ప్రభుత్వ అనుకూలత, సుపరిపాలన, పారదర్శకత ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ద్వేషభావాన్ని దేశం తిరస్కరించిందన్నారు. ప్రజల ఆశయాలను బలోపేతం చేయడానికి ప్రజాస్వామ్య ఆలయమే కీలకం అన్నారు. పార్లమెంట్ సమావేశాలకు వచ్చే సభ్యులందరూ ప్రిపేరు కావాలని, బిల్లుల గురించి సభలో చర్చ జరగాలని ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. సభలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలన్నారు. కొత్త పార్లమెంట్‌లో ఫలవంతమైన చర్చలు జరగాలని ఆశిస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు.

# కాజీపేట- విజయవాడ మార్గంలో పలు రైళ్లు రద్దు





**టీ మీడియా, డిసెంబర్ 4, వరంగల్ :**
కాజీపేట-వరంగల్ రైల్వేస్టేషన్ల మధ్య జరుగుతున్న మూడోలైను పనుల కారణంగా కాజీపేట-విజయవాడ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గుంటూరు-సికింద్రాబాద్ ఇంటర్ సిటీ ఈ నెల 10 నుంచి 18 వరకు, సికింద్రాబాద్- విజయవాడ శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 7వ తేదీతోపాటు 10 నుంచి 18 వరకు, సికింద్రాబాద్-భద్రాచలం రోడ్డు కాకతీయ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 6వ తేదీతోపాటు, 10 నుంచి 18 వరకు, ఆదిలాబాద్-తిరుపతి కఅష్ణా ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 5 నుంచి 19 వరకు రద్దు చేశారు. కాజీపేట-డోర్నకల్, డోర్నకల్-విజయవాడ ప్యాసింజర్ పుష్‌పుల్ రైళ్లను ఈ నెల 10 నుంచి 18 వరకు, కాజీపేట-తిరుపతి, లింగంపల్లి నుంచి కాకినాడ వెళ్లే గౌతమి రైళ్లను కూడా ఈ నెల 10 నుంచి 18 వరకు రద్దు చేశారు. అలాగే గోల్కండ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11 నుంచి 19 వరకు కాజీపేట వరకు మాత్రమే నడుస్తుంది. భద్రాచలం రోడ్ నుంచి బల్లార్షా వెళ్లే సింగరేణి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6 నుంచి 8 వరకు, 10 నుంచి 19 వరకు హసన్పర్తి రోడ్ వరకు మాత్రమే నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

# ఇంటెలిజెన్స్ ఓఎస్డీ ప్రభాకర్ రావు రాజీనామా




**టీ మీడియా, డిసెంబర్ 4, హైదరాబాద్:**
తెలంగాణలోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ లోగల యాంటీ నక్సల్ ఇంటెలిజెన్స్ విభాగానికి ప్రత్యేక అధికారిగా ఉన్న మాజీ ఐపీఎస్ ఆఫీసర్ టీ ప్రభాకర్ రావు తన పదవికి రాజీనామా చేశారు. సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడు అయిన ప్రభాకర్ రావు మూడేళ్ల క్రితం పదవీ విరమణ చేసి, ఆ తర్వాత ఇంటెలిజెన్స్ ఓఎస్డీగా కొనసాగుతున్నారు. కొంత కాలం క్రితం ఓఎస్డీ ప్రభాకర్ రావుపై పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్‌లను టాప్ చేస్తున్నారని ఆరోపించారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత తీవ్ర పరిణామాలను అనుభవిస్తావని ప్రభాకర్ రావును హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడంతో పదవికి రాజీనామా చేశారు. ఇప్పటికే ట్రాన్స్ కో, జెన్ కో సీఎండీ డీ ప్రభాకర్ రావు కూడా తన పదవికి రాజీనామా చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి కూడా తన పదవి నుంచి వైదొలిగారు.

# ఇతిహాసాలు మానవ జీవన వికాసానికి సన్మార్గాలు



**టీ మీడియా, డిసెంబర్ 4, మహానంది:**
ఇతిహాసాలు మానవ జీవన వికాసానికి సన్మార్గాలని రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ నాగభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని శివాలయం వద్ద నంద్యాల ఇస్కాన్ వారి సహకారంతో పగడాల ప్రసాద్ ఆధ్వర్యంలో వాల్మీకి రచించిన రామాయణం గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇతిహాసాలు మానవ జీవన సన్మార్గాలని,రామాయణం మానవ జీవన వికాసానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహానంది దేవస్థానం ధర్మకర్త రామ తులశర్మ దంపతులు,ఒంటెద్దు రామలింగేశ్వర రెడ్డి, పురోహితులు రెంటచింతల రఘుకుమార్, భాగ్యలక్ష్మి, ఆదిలక్ష్మి, కళ్యాణ్ పాల్గొన్నారు.

# పాడి కౌశిక్ రెడ్డి పై కేసు నమోదు



**టీ మీడియా, డిసెంబర్ 4,కరీంనగర్ :**
బీఆర్ఎస్ అభ్యర్థిగా పాడి కౌశిక్ రెడ్డి గెలుపొందారు. అయితే ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిన్న కౌంటింగ్ సందర్భంగా పోలీసుల విధులకు కౌశిక్ రెడ్డి ఆటంకం కలిగించారని ఓ హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు చేశాడు. దీంతో కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో పలు సెక్షన్ల కింద పాడి కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఎన్నికల ప్రచారంలో భాగంగా భావోద్వేగ ప్రసంగం చేయడం ద్వారా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారని ఐదు రోజుల క్రితం కమలాపూర్ పోలీస్టేషన్‌లో సైతం కౌశిక్ రెడ్డిపై కేసు నమోదైంది.